క్లుప్తంగా

నేరడిలో కేంద్ర బృందం పర్యటన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

కొత్తూరు: మండలంలోని నేరడి గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025 సర్వేలో భాగంగా కేంద్ర బృందం సభ్యులు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా, ఎంపీడీఓ నీరజ మంగళవారం పర్యటించారు. గ్రామ సచివాలయాన్ని ప్రజలు వినియోగించుకోవడం, మరుగుదొడ్ల వినియోగం, మురుగునీటి కాలువల నిర్వహణ వంటివి పరిశీలించారు. గ్రామస్తుల నుంచి పలు వివరాలు సేకరించారు.

సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సర్వశిక్ష అభియాన్ ఒప్పంద ఉద్యోగులు

నరసన్నపేట: తమ సమస్యలు పరిష్కరించాలని సర్వశిక్ష అభియాన్ ఒప్పంద, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మంగళవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎంటీఎస్, హెచ్ఆర్ పాలసీ కల్పించాలని డిమాండ్ చేశారు. గడిచిన ఆరేళ్లుగా ఎటువంటి వేతనాలు పెంపు లేకుండా పని చేస్తున్నామని, వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు బి.గిరధర్, జి.శ్రీనివాసరావు, బి.సైలజ, శిరేఖ, చిన్నారావు, పెద్దవాడు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

సారవకోట: గ్రామ, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా సూచించారు. సారవకోటలో చెత్త సేకరణ కార్యక్రమం ఏ విధంగా జరుగుతుందో మంగళవారం పరిశీలించారు. గ్రామంలోకి చెత్త సేకరణ బండి వచ్చే సమయంలో తడి, పొడి చెత్త వేరు చేసి వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై దృష్టి



పశుగ్రాసం పెంపకాన్ని పరిశీలిస్తున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: పాడి రైతులందరూ పశుగ్రాసం పెంపకంపై దృష్టి సారించాలని పాతపట్నం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.కరుణాకరరావు అన్నారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని సీది గ్రామంలో పాడి రైతులు సాగు చేస్తున్న పశుగ్రాసం పెంపకాన్ని పరిశీలించారు. పాడి రైతులు తమకున్న భూమిలో 10 సెంట్లు మేరకు పశుగ్రాసం సాగు చేయాలన్నారు. పశువులకు పచ్చిమేత వేయడం వల్ల దాణా ఖర్చు తగ్గుతుందన్నారు. గుణాలమ్మ, యశ్వంత్, రామ్మోహన్, జగదీష్, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం రోటరీ మాజీ కార్యదర్శి, కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ జె.రవిబాబు ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మోణింగి వారి వీధిలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.సురేష్, జి.సాయి కిరణ్ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. విద్యార్థుల ఎత్తు, బరువు, హిమోగ్లోబిన్ శాతం, బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారి మందులు పంపిణీ చేశారు. వైద్యులు డి.సురేష్ మాట్లాడుతూ 15 నుంచి 17 ఏళ్ల మధ్య వయసులో ఉన్న ఆడ పిల్లల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండటం సహజమేనని, తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్యామసుందర్, అధ్యాపకులు రేవతి, పద్మ, పుష్ప, పెంటయ్య, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పోలాకి: గాతలవలసలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు



హిరమండలం: వైఎస్సార్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు



కొత్తూరు: మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో కేకను పంచిపెడుతున్న పార్టీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, నాయకులు



ఆమదాలవలస: బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పార్టీ శ్రేణులు



ఆమదాలవలస: కేక్ కట్ చేస్తున్న చింతాడ రవికుమార్, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్‌కుమార్

జనహృదయ నేత.. వైఎస్సార్

ఉచిత విద్యుత్‌తో వ్యవసాయాన్ని పండగగా, జలయజ్ఞంతో బంజరు భూములను సస్యశ్యామలంగా, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేదలను విద్యావంతులుగా, ఆరోగ్యశ్రీతో పేదల ఆర్యోగానికి భరోసాగా, 108 అంబులెన్స్‌లతో ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచిన మహా నాయకుడు వైఎస్సార్ అని నేతలు కొనియాడారు. దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రతి పేదింటి పెద్దకొడుకులా బాధ్యత వహిస్తూ అనుక్షణం ప్రజల బాగోగుల కోసమే పరితపించిన జనహృదయ నేత మన రాజన్న అని అన్నారు. పాలకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమదాలవలసలో తమ్మినేని ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పేదలకు దుస్తులు, రోగులకు పండ్లు, రొట్టెలను నాయకులు పంచిపెట్టారు. మాజీ స్పీకర్, పార్టీ శ్రీకుకాళం పార్లమెంట్ సమన్వయకర్త తమ్మినేని సీతారాం, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, పార్టీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, పార్టీ కాళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ బీసీ సెల్ రీజనల్ కో–ఆర్డినేటర్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ అన్ని విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



సరుబుజ్జిలి: సరుబుజ్జిలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు



పొందూరు: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కళింగ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు



పాతపట్నం: పాతపట్నంలో కేక్ కట్ చేస్తున్న మామిడి శ్రీకాంత్



సారవకోట: సారవకోటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాతపట్నం: ఆస్పత్రి కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మహిళలకు మిఠాయిలు పంచిపెడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పొందూరు: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చింతాడ రవికుమార్



నరసన్నపేట: వైఎస్సార్ కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు



బూర్జ: మదనాపురంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న చింతాడ రవికుమార్



మెళియాపుట్టి: మిఠాయిలు, పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: కొమనాపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు



కొత్తూరు: హైదరాబాద్‌లోని రామకృష్ణాపురంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కొత్తూరు, భామిని మండలాల వాసులు



హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలో మిఠాయిలు పంచుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి

నరసన్నపేట: పోలింగ్ కేంద్రాల్లో బూత్ స్థాయి అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని, చిన్న పొరపాటు కూడా చేయవద్దని నరసన్నపేట ఈఆర్ఓ జి.జయదేవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్ఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. అనర్హుల పేర్లు, మృతి చెందిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన ఓట్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు జాబితాలో పేర్లు సరి చేసుకోవాలన్నా.. మరో పోలింగ్ కేంద్రానికి పేర్లు బదలాయించుకోవాలన్నా సంబంధిత ఫారాన్ని ఓటర్లకు ఇవ్వాలన్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేట్ పేర్లు లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గంలోని 290 పోలింగ్ కేంద్రాల బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తామని, దీంట్లో భాగంగా మంగళవారం 50 పోలింగ్ కేంద్రాలకు చెందిన బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. నరసన్నపేట, జలుమూరు తహసీల్దార్లు టి.సత్యనారాయణ, జెన్ని రామారావు, సూపరింటెండెంట్ పొదిలాపు శ్రీనివాసరావు, ఎలక్షన్ డీటీ శరత్, తదితరులు పాల్గొన్నారు.



నరసన్నపేట: మాట్లాడుతున్న ఈఆర్ఓ జయదేవి

బీఎల్‌ఓలకు శిక్షణ

పాతపట్నం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పాతపట్నం నియోజకవర్గ స్థాయి బీఎల్‌ఓలకు మంగళవారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెడ్పీ సీఈవో, ఈఆర్ఓ శ్రీధర్ రాజా ప్రారంభించారు. ఓటర్ల జాబితా సవరణలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు, ఎన్నికల డీటీ కె.నారాయణ, ఏఎస్ఓ బాలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

పాతపట్నం: ఈ నెల 10వ తేదీన మండల కేంద్రంలోని కేఎస్ఎం ప్లాజాలో ఉదయం 10 గంటల నుంచి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల నాయకులు కోరారు. పాతపట్నంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకర్లతో మంగళవారం మాట్లాడారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ పేరుతో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పార్టీ ఐటీ వింగ్ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, పార్టీ నాయకులు బి.నారాయణమూర్తి, గొకవలస రాము, పద్ధ నేతాజీ, మజ్జి తిరుపతిరావు, పనుకు మోహన్, మజ్జి వరదరాజులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్

రైతుకు భరోసా లేదు

- రైతు దినోత్సవాన్ని అన్నదాతలు ఆనందంగా నిర్వహించలేకపోయారు
- వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్

ఆమదాలవలస: రాష్ట్రంలో రైతు దినోత్సవాన్ని అన్నదాతలు ఆనందంగా నిర్వహించడానికి వీల్లేకుండా కూటమి ప్రభుత్వం చేసిందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు దినోత్సవం రోజునే రైతు భరోసా డబ్బులు వేసి రైతులకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచేవారన్నారు. ఈ ప్రభుత్వం అన్నదాత సుఖీభవకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, ఎంతమందిని జాబితా నుంచి తొలగించాలనే యోచనలో ఉందన్నారు. కూటమి నాయకులు మాయ మాటలు చెప్పుకొని గ్రామాల్లో తిరుగుతున్నారని, సూపర్ సిక్స్‌లో ఒక్క పథకం కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సకాలంలో పథకాలు అందించడం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. అటువంటి నాయకత్వం మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ఆమదాలవలస: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వరి వెదలు, నార్లు వేసే పనిలో ఉన్నారని, రసాయన, పురుగు మందులు ఉపయోగించకుండా ప్రకృతి వ్యవసాయంలో పంటలను సాగు చేసుకోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో నేలకు, వాతావరణానికి ఏ విధమైన హాని ఉండదన్నారు. ప్రకృతి సేద్యంతో మంచి దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

సంక్షిప్తంగా..

50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయండి

హిరమండలం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.ఢిల్లేశ్వరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హనుమంతురావుకు బీజేపీ నాయకులతో కలిసి మంగళవారం వినతిపత్రం అందించారు.

ఆశ కార్యకర్తల పాత్ర కీలకం

హిరమండలం: మాతాశిశు ఆరోగ్య సంరక్షణలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమని హిరమండలం ప్రాథమిక ఆరోగ్యం వైద్యాధికారి ఫరుక్ హుస్సేన్ అన్నారు. పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రక్తహీనత, ఫ్యామిలీ ప్లానింగ్, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో మేలు

హిరమండలం: వరి విత్తనాలను శుద్ధితో అనేక లాభాలు ఉన్నాయని ఏఓ బి.సంధ్య అన్నారు. మండలంలోని అంబావల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విత్తన శుద్ధి, ఎరువుల వాడకం, పొలం గట్లపై మొక్కల పెంపకంపై రైతుల అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన రైతులకు మొక్కల పంపిణీ

సారవకోట: మండలంలోని 300 మంది గిరిజన రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు పంపిణీ చేసినట్లు ఏపీఓ నారాయణరావు మంగళవారం తెలిపారు. 20 పంచాయతీల్లో ఉన్న గిరిజనులకు 1,855 కొబ్బరి, 5,180 జీడి, 130 నిమ్మ, 120 సపోట మొక్కలు అందజేశామన్నారు.

మొదటి ఎరువులోనే పొటాష్ వేయాలి

నరసన్నపేట: రైతులు వరి వెద పొలాల్లో తగిన పద్ధతుల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, అప్పుడే అధిక దిగుబడులు సాధ్యమని, ఖర్చులు కూడా తగ్గుతాయని ఏఓ వై.సూర్యకుమారి అన్నారు. మండలంలోని బొరిగివలస, దేశవానిపేటల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు రైతులకు వివరించారు. మొదటి ఎరువులో డీఏపీతోపాటు పొటాష్ వేయాలని సూచించారు. పొట్ట దశలో మరోమారు యూరితో కలిపి పొటాస్ వేయాలన్నారు. వీఏఏలు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు



జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ లావణ్య

పాతపట్నం: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం మండల కేంద్రంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలను గుర్తించేందుకు పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. జాగిలాలతో పాతపట్నం మార్కెట్, ప్రధాన రహదారి పక్కన ఉన్న కిరాణా, పాన్‌షాపులు, హోల్‌సేల్ మార్ట్‌ల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ బి.లావణ్య, పోలీసులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో..



కాలేజ్ రోడ్డులోని దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

నరసన్నపేట: స్కూళ్లు, కాలేజీలు, ఐటీఐలు ఉన్న ప్రదేశాల్లో పాన్ షాపులు, కిరాణా షాపుల్లో నిషిద్ధ సిగరెట్లు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. నరసన్నపేట కాలేజీ రోడ్డులోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈగల్ టీమ్ సభ్యుడు రాము, నరసన్నపేట ఎంఈఓ దాలినాయుడు, ఎస్ఐ దుర్గాప్రసాద్, వీఆర్ఓ, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎస్సై రమేష్ బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కళాశాలలు, పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న షాపుల్లో పోలీసు జాగిలాలతో తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలు కలిగిఉంటే సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు. ఏఎస్ఐ బగాది అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: మండల కేంద్రంలో మగళవారం రాత్రి ఎస్ఐ ఎం.అమీర్ అలీ ఆధ్వర్యంలో పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సీఐ ప్రసాదరావు నారీశక్తి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీలను ఆదాయవనరులుగా మార్చాలి

పొందూరు: గ్రామ పంచాయతీలు చెత్త సంపద తయారీ కేంద్రాలను(ఎస్‌డబ్ల్యూపీసీ) ఆదాయ వనరులుగా మార్చుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతీ సౌజన్య అన్నారు. మండలంలోని తండ్యాం పంచాయతీని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న చెత్త సేకరణను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను సేకరించి వాటిని సారవంతమైన ఎరువుగా మార్చి రైతులకు విక్రయించడం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఇంటింటికీ వెళ్లి ఐవీఆర్ఎస్ కాల్స్, తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మీసాల మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో భూసారం

జలుమూరు: రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, భూసారం పెంచే సేంద్రియ ఎరువుల వల్ల పంట నాణ్యతతోపాటు పెట్టుబడి తగ్గించుకోవచ్చని నరసన్నపేట వ్యవసాయ సహాయక సంచాలకులు ఎల్.వి.మధు అన్నారు. మంగళవారం గొటివాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి వెద, ఊభాలులో కాలిబాటలు తీసుకోవాలన్నారు. దీనివల్ల పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ఏఓ కె.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

కొత్తూరు: కార్మికుల హక్కులు రక్షణ కోసం ఈ నెల 9 తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ కోరారు. కొత్తూరులో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. దేశ వ్యాప్త సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

ఆమదాలవలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో పెన్షనర్లు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొనాలని సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు కోరారు. ఈ ర్యాలీ బుధవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి ప్రధాన రహదారి గుండా వన్‌వే సెంటర్ వద్ద నున్న మహాత్మా గాంధీ విగ్రహం వరకు ఉంటుందన్నారు. అక్కడ మానవహారంగా ఏర్పడి నిరసన తెలియజేస్తామన్నారు.